కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -228 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 29-08-2026 శనివారం పేజీలు : 4



# పురపోరు..
# పరిషత్ పోరు!

- డిసెంబర్‌లో రెండో దశ పురపోరు!
- మున్సిపల్ ఎన్నికలకు కసరత్తు షురూ
- కార్పొరేషన్లకూ ఒకేసారి ఎన్నికలు
- 'సర్' తర్వాతే ఎన్నికల షెడ్యూల్
- పురపోరు తర్వాత పరిషత్ ఎన్నికలు
- 31 జడ్పీలు.. 565 మండలాలకు పోరు
- ఎన్నికలకు పార్టీ శ్రేణులకు ఆదేశాలు
- కేంద్ర నిధుల కోసం ఎన్నికల వేగం

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్‌ఎస్):** రాష్ట్రంలో రెండో దశలో కార్పొరేషన్లతోపాటు మిగిలిన పట్టణ స్థానిక సంస్థల కు (యూఎల్‌బీ) వచ్చే డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. మున్సిపల్ పాలకమండళ్ల కాలపరిమితి ముగియడం, ఎన్నికలు త్వరితగతిన నిర్వహించకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. రెండోదశ పురపాలక ఎన్నికలు ముగిసిన తర్వాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు కాంగ్రెస్‌వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తికానున్నది.

# 'దింపుడుకళ్లెం ఆశ'

- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు ఫైర్
- ఎన్నికలు ఆలస్యమైతే నష్టమే
- జగన్ ఆశలు ఫలించవు
- పారదర్శక ఎన్నికలకే సీఎం పిలుపు
- బీసీలకు 34% రిజర్వేషన్లు
- బీసీలకు టీడీపీ పెద్దపీట
- వచ్చే ఏడాదే పోలవరం పూర్తి!


2 లో

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్‌ఎస్):** అమరావతిలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఎస్సార్ సీపీ, మాజీ సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం జగన్‌కు తమాత్రం ఇష్టం లేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జాప్యం జరిగేకొద్దీ అధికార కూటమికి నష్టం కలుగుతుందనే భ్రమలో జగన్ ఉన్నారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.


# 50 లక్షల కోసం దారుణ హత్య


2 లో

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్‌ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా పరిధిలో రెండు నెలల క్రితం జరిగిన ఓ వివాహిత దారుణ హత్య ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చి తీవ్ర కలకలం రేపింది.

# నేపాల్‌లో మృత్యు విలయం


- 469కి చేరిన మృతులు
- 1500 మంది ఆచూకీ లేదు
- 178 మంది భారతీయులు గల్లంతు
- 11 మంది భారతీయుల రెస్క్యూ
- చైనా లెవల్-4 హెచ్చరిక
- ఉప్పొంగే ప్రమాదంలో సరస్సు
- రెండు నదుల సంగమంలో ముప్పు



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్‌ఎస్):** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య 469కి చేరుకున్నట్లు ఆ దేశ పోలీసులు వెల్లడించారు. వరదల వల్ల సుమారు 1500 మంది ఆచూకీ లేనట్లు కూడా తెలిపారు. ఇక మరో వైపు చైనా వార్నింగ్ ఇచ్చింది.


2 లో

# విదేశీ విద్యకు సర్కార్ భరోసా


2 లో

- 350 మందికి ఓవర్సీస్ విద్యానిధి ద్వారా ప్రయోజనం
- సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- బీసీలకు 250, ఈబీసీలకు 100 సీట్లు
- డిగ్రీలో 60 శాతం మార్కులు తప్పనిసరి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం
- విదేశీ విద్యకు భారీగా ఆర్థిక సహాయం
- అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

# మెడికల్ బోర్డుపై కవిత ఆగ్రహం


2 లో

- 120 మంది హాజరు.. 12 మందికే అన్‌ఫిట్
- కార్మికులపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం
- అర్హులందరినీ అన్‌ఫిట్ చేయాలన్న డిమాండ్
- సింగరేణి కార్మికుల హక్కులపై కవిత పోరాటం
- కార్మికులకు అన్యాయం చేస్తే గుణపాఠమే
- సింగరేణి కుటుంబాలకు న్యాయం జరిగేనా?

# రాఖీ రద్దీ.. ఆర్టీసీ దోపిడీ!

- '1.50' రూల్‌తో బాదుడు!
- స్పెషల్ పేరుతో స్పెషల్ బాదుడు!
- ప్రయాణికులపై ఆర్టీసీ మోత!
- చార్జీలపై ముందస్తు సమాచారం ఏదీ?
- జర్నలిస్టు పాసులకూ బ్రేక్!
- కండక్టర్ల దురుసు సమాధానాలు!
- మహాలక్ష్మి రద్దీ.. ప్రయాణికులకు ఇక్కట్లు!
- ఆప్షన్ లేక స్పెషల్ బస్సులే దిక్కు!



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్‌ఎస్):** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్తున్న ప్రయాణికులపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఊహించని షాకిచ్చింది. పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని స్పెషల్ బస్సుల నెపంతో ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచి ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతోంది. సాధారణ రోజుల్లో కంటే దాదాపు 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తుండటంతో నిరుపేద, మిడిల్ క్లాస్ ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'1.50' రూల్ పేరుతో నిలువు దోపిడీ..

తిరుగు ప్రయాణంలో బస్సులు ఖాళీగా వస్తాయనే సాకుతో ఆర్టీసీ యాజమాన్యం '1.50' వింత నిబంధనను తెరపైకి తెచ్చింది. పండుగ వేళ సొంత ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను ఇది తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే మెట్రో డీలక్స్, రాజధాని బస్సు ఛార్జీ రూ.290 ఉండగా, ప్రస్తుతం స్పెషల్ బస్సుల్లో ఏకంగా రూ.400 వరకు వసూలు చేస్తున్నారు.

2 లో

# రాఖీతో రాజీ సంకేతాలా?

- రాఖీ సెంటిమెంట్‌తో డ్యామేజ్ కంట్రోల్
- అధిష్టానం నిర్ణయంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- మంత్రి పదవిపై వీడని సస్పెన్స్
- రాఖీతో విభేదాలకు ముగింపు పలికేనా
- సురేఖ వ్యూహం ఫలిస్తుందా లేదా
- కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారిన భేటీ
- ఏఐసీసీ నిర్ణయంపైనే అందరి చూపు

2 లో

# కొండగట్టు పనులకు బ్రేక్ ఎందుకు?

- రూ.35.19 కోట్ల నిధులున్నా బ్రేక్ ఎందుకు?
- శంకుస్థాపన జరిగి నెలలు.. పనులు ఎప్పుడు?
- టెండర్లకు ఎందుకు జాప్యం?
- కొండగట్టు పనులపై జనసేన ఫైర్
- ప్రభుత్వాన్ని నిలదీసిన జనసేన
- పొన్నం, ఎమ్మెల్యేపై ప్రశ్నల వర్షం
- భక్తుల వసతులపై నిర్లక్ష్యమేనా?
- వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్


2 లో

# పాక్ ఆరాటం.. భారత్ అప్రమత్తం

- ఎస్-400 కోసం పాక్ గూఢచర్యం
- భారత్ ఎయిర్ డిఫెన్స్‌పై పాక్ కన్ను
- గూఢచారులను రంగంలోకి దించిన పాక్
- భారత రక్షణ వ్యవస్థపై నిఘా ప్రయత్నం
- పాక్ కుట్రను తిప్పికొట్టిన భారత్
- సరిహద్దుల్లో భారత్‌కు వ్యూహాత్మక ఆధిక్యం

2 లో

# అమరావతికి భారీ భూసమీకరణ

- మోతడకలో సీఆర్డీఏ నోటిఫికేషన్
- 2,344 ఎకరాలపై సమీకరణ
- ఇన్నర్ రింగ్ రోడ్‌కు భూములు
- కొత్త రైల్వే లైన్ కోసం భూములు
- అమరావతి కనెక్టివిటీకి బిగ్ అడుగు
- రాజధాని విస్తరణకు వేగం
- పట్టా భూమి 1,654 ఎకరాలు

2 లో

# రాఖీతో రాజీ సంకేతాలా?



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** తెలంగాణ రాజకీయం ప్రస్తుతం ఆసక్తికర మలుపు తిరిగింది. మంత్రి కొండా సురేఖ వర్సెస్ కాంగ్రెస్ అధిష్టానం నడుమ గత కొన్ని రోజులుగా ఉత్కంఠ కొనసాగుతుండటం, సుస్మిత వ్యాఖ్యల వివాదంపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన నివేదిక ఏఐసిసి పరిధిలో ఉండటంతో కేబినెట్ నుంచి ఉద్వాసన లేదా రాజీనామా ఖాయమనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో స్వయంగా మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఆత్మీయ వ్యూహం..

పదవి ఊడుతుందనే ప్రచారానికి చెక్ పెట్టేందుకే సురేఖ ఈ 'రాఖీ సెంటిమెంట్'ను తెరపైకి తెచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయాల్లో విమర్శలు, విభేదాలు ఉన్నప్పటికీ 'అన్న-చెల్లెళ్ల' బంధం ద్వారా డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు ఆత్మీయ భేటీ మార్గాన్ని ఎంచుకున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

రాజీనామా వార్తలకు చెక్ పడినట్లేనా?

ఈ ఒక్క కలయికతో ముఖ్యమంత్రితో ఉన్న విభేదాలు తొలిగిపోతాయా? రాఖీతో ప్రారంభమైన ఈ 'రాజీ మార్గం' కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహాన్ని చల్లార్చుతుందా? అనే ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. ఒకవేళ ఈ ఆత్మీయ వ్యూహం ఫలిస్తే మంత్రి పదవికి ఎలాంటి ముప్పు ఉండకపోవచ్చని, లేకపోతే రాబోయే రోజుల్లో ఏఐసీసీ తీసుకునే నిర్ణయమే తుది తీర్పుగా మారే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

# రాఖీ రద్దీ.. ఆర్టీసీ దోపిడీ!

మొదటి పేజీ తరువాయి

సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రతి టికెట్‌పై రూ.100 నుంచి రూ.150 వరకు అదనపు భారం వేశారు. కరీంనగర్‌తో పాటు వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ మార్గాల్లోనూ ఇదే రీతిలో ఛార్జీలను బాదేస్తున్నారు.

బస్సు ఎక్కిన తర్వాత కండక్టర్ల షాక్..

టికెట్ కౌంటర్లు, బస్టాండ్లలో ముందస్తుగా ఎలాంటి స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా, ప్రయాణికులు బస్సు ఎక్కి ప్రయాణం ప్రారంభించిన తర్వాత మార్గమధ్యంలో కండక్టర్లు అదనపు ఛార్జీలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో బస్సుల్లో ప్రయాణికులకు, ఆర్టీసీ సిబ్బందికి మధ్య లొల్లి మొదలవుతోంది. ఛార్జీలపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా బస్సు ఎక్కాక ఎక్కువ మొత్తం అడిగితే ఎలా చెల్లించాలని ప్రయాణికులు లబోదిబోమంటున్నారు.

జర్నలిస్టుల పాసులకు దిక్కులేదు..

మరోవైపు స్పెషల్ బస్సుల పేరుతో ఆర్టీసీ నియమ నిబంధనలను పక్కనబెడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం స్టేట్, జిల్లా జర్నలిస్టులకు వర్తించాల్సిన 1/3 వంతు కాన్సెషన్ రూల్‌ను సదరు స్పెషల్ బస్సుల్లో వర్తింపజేయడం లేదని తెలుస్తోంది. ఇదేంటని జర్నలిస్టులు ప్రశ్నిస్తే.. కండక్టర్లేమో తనకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ పొంతన లేని సమాధానాలు చెబుతూ తప్పించుకుంటున్నారు. గట్టిగా అడిగితే.. బస్సు దిగండి లేదా టికెటైనా తీసుకోండి అంటూ కండక్టర్లు దురుసుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు సాధారణ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండటంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ విపరీతమైన రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో కుటుంబ సమేతంగా వెళ్లే పురుషులు, సాధారణ ప్రయాణికులకు ఆర్డినరీ సర్వీసులలో సీట్లు దొరకడం లేదు. ఆప్షన్ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు స్పెషల్ బస్సులను ఆశ్రయిస్తుంటే, ఆర్టీసీ మాత్రం లాభార్జనే ధ్యేయంగా ఛార్జీల మోత మోగిస్తోందని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

# నేపాల్‌లో మృత్యు విలయం

మొదటి పేజీ తరువాయి

మళ్లీ దిగువ ప్రాంతాలకు మరింత భీకర వరదలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు డ్రాగన్ దేశం హెచ్చరించింది. తాజా వరదల్లో సుమారు 178 మంది భారతీయులు గల్లంతు అయినట్లు నేపాల్ అధికారులు చెబుతున్నారు. 11 మందిని రెస్క్యూ చేశారు. విదేశీ పర్యాటకులతో పాటు మానస సరోవర యాత్రకు వెళ్లిన యాత్రికులు ఎక్కువ సంఖ్యలో మిస్ అయినట్లు తెలుస్తోంది.

టిబెట్-నేపాల్ బోర్డర్ వద్ద లెవల్-4 హెచ్చరిక జారీ చేసింది చైనా. బుధవారం నాటి మట్టిచరియలు విరిగిపడిన ఘటన తర్వాత తాత్కాలిక సరస్సులు ఏర్పడినట్లు చైనా చెప్పింది. రెండు నదుల సంగమం వద్ద ఇలా జరిగినట్లు ఆ దేశం పేర్కొన్నది. అయితే ఏ క్షణమైనా ఆ తాత్కాలిక సరస్సు ఉప్పొంగే అవకాశాలు ఉన్నట్లు చైనా అభిప్రాయపడింది. టిబెట్ ఆటోనమస్ ప్రాంతంలో చైనా జలవనరుల మంత్రిత్వశాఖ ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసింది. చోచెన్ ఖోలా, పెరుపా సాంగో నదుల కలయిక వద్ద భారీగా బేరియర్ లేక్ ఏర్పడినట్లు చైనా పేర్కొన్నది. ఈ రెండు నదులూ టిబెట్‌లో ఉద్భవిస్తాయి. ఇవి నేపాల్లోకి ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి బోటే కోసిగా ఈ నదులు రూపాంతరం చెందుతాయి.

అయితే ఈ రెండు నదుల సంగమం వద్ద సుమారు రెండు మిలియన్ల క్యూబిక్ మీటర్ల మేర నీరు ఉన్నట్లు చైనా చెబుతోంది. దీంతో పెను ప్రమాదం పొంచి ఉన్నట్లు చైనా హెచ్చరించింది. ఆ ముప్పు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేపడుతున్నారు. ఆ తాత్కాలిక సరస్సు వల్ల రెస్క్యూ చర్యలు ఆలస్యం అవుతున్నాయి. ఎప్పుడు ఆ సరస్సు ఉప్పొంగుతుందో అన్న భయం నెలకొన్నది. బురదతో కొట్టుకువచ్చిన బండరాళ్లు అడ్డుపడడంతో.. రెండు నదుల సంగమం వద్ద భారీగా ఓ సరస్సు ఏర్పడింది. దీని వల్ల ముప్పు ఉందని భావిస్తున్నారు.

# 50 లక్షల కోసం దారుణ హత్య



న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా పరిధిలో రెండు నెలల క్రితం జరిగిన ఓ వివాహిత దారుణ హత్య ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చి తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. స్థానికంగా నివాసముండే ఆదిలక్ష్మి (32) అనే మహిళకు భారీగా వడ్డీ ఆశ చూపిన మరో మహిళ ఆమెను నమ్మించింది. అధిక వడ్డీ వస్తుందన్న ఆశతో ఆదిలక్ష్మి తన బంగారు ఆభరణాలను విక్రయించడంతో పాటు ఇతరుల వద్ద అప్పులు చేసి సుమారు 50 లక్షల నగదును నిందితురాలికి ఇచ్చింది. అయితే గడువు ముగిసినా డబ్బులు తిరిగి ఇవ్వకపోగా కాలయాపన చేస్తుండటంతో, తన నగదు తిరిగి ఇవ్వాలంటూ ఆదిలక్ష్మి గట్టిగా ఒత్తిడి చేయడం ప్రారంభించింది.

డబ్బులు తిరిగి ఇవ్వడం ఇష్టం లేని నిందితురాలు ఆదిలక్ష్మిని అంతమొందించాలని పథకం పన్నింది. నగదు ఇస్తానని నమ్మించి ఇంటికి పిలిపించుకుని ఆమెను దారుణంగా హత్య చేసింది. అనంతరం సాక్ష్యాధారాలు లభించకుండా ఉండేందుకు మృతదేహాన్ని ఓ ప్లాస్టిక్ డబ్బాలో కుక్కి సమీపంలోని వ్యవసాయ పొలంలో గుట్టుచప్పుడు కాకుండా పాతిపెట్టింది. భార్య కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితురాలిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఈ కిరాతక హత్య బట్టబయలైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# అమరావతికి భారీ భూసమీకరణ



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ మరో కీలక అడుగు వేసింది. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం గుంటూరు జిల్లా తాడికొండ మండల పరిధిలోని మోతడక గ్రామంలో భూసమీకరణ చేపట్టేందుకు సీఆర్డీఏ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. అమరావతికి ఎంతో కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణంతో పాటు, రాజధానిని అనుసంధానించే నూతన రైల్వే లైన్ ప్రాజెక్టు అవసరాల కోసం ఈ భూమిని సమీకరిస్తున్నట్లుగా సీఆర్డీఏ నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది.

అయితే, మొత్తం భూసమీకరణ విస్తీర్ణం 2,344.12 ఎకరాలు ఉండగా.. అందులో పట్టా భూమి 1,654.259 ఎకరాలుగా ఉంది. ఇక మిగిలిన భూమిని ప్రభుత్వ భూమిగా సీఆర్డీఏ వర్గీకరించింది. రాజధాని కనెక్టివిటీని వేగవంతం చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు భూసేకరణ కీలకమైన దశ కాడంతో సీఆర్డీఏ మోతడకలో ఈ భూసమీకరణ ప్రక్రియను చేపట్టింది.

# మెడికల్ బోర్డుపై కవిత ఆగ్రహం

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ బోర్డును మొక్కుబడిగా నిర్వహిస్తూ మరోసారి సింగరేణి కార్మికులను దారుణంగా మోసం చేసిందని కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు పరీక్షలకు పిలిపించి, వారిలో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్'గా ప్రకటించడం తీవ్రమైన అన్యాయమని ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలనే తపన గానీ, అనారోగ్యంతో బాధపడుతున్న వారి కుటుంబాలకు తగిన భరోసా కల్పించాలనే చిత్తశుద్ధి గానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని ఈ నిర్ణయంతో మరోసారి స్పష్టమైందని ఆమె విమర్శించారు.

ఈ ప్రభుత్వానికి కార్మికుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హులైన కార్మికుడిని వెంటనే అన్‌ఫిట్‌గా గుర్తించి, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ వారి సంక్షేమాన్ని విస్మరిస్తే కాంగ్రెస్ సర్కార్‌కు కార్మిక క్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని కవిత హెచ్చరించారు. సింగరేణి కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# పాక్ ఆరాటం.. భారత్ అప్రమత్తం



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** భారత్ వద్ద ఉన్న అత్యంత శక్తివంతమైన ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థల ఉనికిని కనుగొనేందుకు పాకిస్తాన్ తీవ్రంగా ప్రయత్నించిందని ఎయిర్ మార్షల్ జేతేంద్ర మిశ్రా వెల్లడించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత సరిహద్దుల్లో ఈ క్షిపణులు ఎక్కడ మోహరించారో తెలుసుకోవడానికి పాక్ ప్రత్యేకంగా గూఢచారులను కూడా రంగంలోకి దించిందని ఆయన తెలిపారు.

వ్యూహాత్మక ఆధిక్యం..

రష్యా నుంచి భారత్ సేకరించిన ఎస్-400 వ్యవస్థతో భారత వైమానిక దళ రక్షణ సామర్థ్యం ఊహించని రీతిలో పెరిగింది. దీంతో శత్రుదేశాల విమానాలు, క్షిపణులు సుదూరంలో ఉన్నప్పుడే ధ్వంసమయ్యే ప్రమాదం ఉండటంతో పాకిస్తాన్ తీవ్ర భయాందోళనలకు గురైంది. అయితే, ఈ క్షిపణుల ఖచ్చితమైన ప్రదేశాలను తెలుసుకునేందుకు పాక్ నిఘా సంస్థలు ప్రయత్నించినప్పటికీ, భారత దళాలు ఆ వివరాలు బయటకు పొక్కకుండా పక్కా వ్యూహంతో ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచాయి. ప్రస్తుతం పాకిస్తాన్ చేసిన గూఢచార ప్రయత్నాలన్నింటినీ భారత భద్రతా బలగాలు, నిఘా వర్గాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని ఎయిర్ మార్షల్ జేతేంద్ర మిశ్రా పేర్కొన్నారు. ఎస్-400 క్షిపణి వ్యవస్థల రాకతో సరిహద్దుల్లో భారత వైమానిక రక్షణ మరింత బలంగా మారిందని ఆయన స్పష్టం చేశారు.

# విదేశీ విద్యకు సర్కార్ భరోసా

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని నిరీక్షిస్తున్న బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి' పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విడతలో మొత్తం 350 మంది అర్హులైన విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఇందులో బీసీ విద్యార్థులు 250 మంది, ఈబీసీ విద్యార్థులు 100 మంది ఉంటారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హత గల అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ గ్రాడ్యుయేషన్ (డిగ్రీలో) కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. విదేశాల్లో నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించాలనే పేద, మధ్యతరగతి బీసీ, ఈబీసీ విద్యార్థుల కలలను నెరవేర్చేందుకు ఈ పథకం కింద ప్రభుత్వం భారీగా ఆర్థిక సాయం అందించనుంది. అర్హత ఉన్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు.

# ఢిల్లీ స్పై కపుల్ అరెస్ట్



**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్నారనే ఆరోపణలతో మహమ్మద్ సాహిల్, ఆయన భార్య సమీరాలను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ అరెస్ట్ చేసింది. 2024 నుంచి సోషల్ మీడియా ద్వారా పాక్ హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతూ వీరు గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2024లో సాహిల్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పాకిస్తాన్‌కు చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే క్రమంగా దేశ వ్యతిరేక గూఢచర్య కార్యకలాపాలకు దారితీసింది. సాహిల్‌తో పాటు అతని భార్య సమీరా కూడా పాక్ హ్యాండ్లర్లతో నిరంతరం టచ్ ఉంటూ భారత రక్షణ విభాగాలకు సంబంధించి, అలాగే స్థానికంగా ఉన్న సున్నితమైన సమాచారాన్ని అందిస్తూ వారికి సహకరించినట్లు తేలింది.

దుబాయ్ మీదుగా పాకిస్తాన్‌కు..

2024 నుంచి 2025 మధ్యకాలంలో ఈ దంపతులు ఎనిమిది భారతీయ సిమ్ కార్డులను సేకరించి, వాటిని దుబాయ్ మీదుగా పాకిస్తాన్‌కు తమ హ్యాండ్లర్లకు పంపారు. ఆ సిమ్ కార్డుల ద్వారా పాక్ ఏజెంట్లు భారతదేశంలో వాట్సాప్ అకౌంట్లు క్రియేట్ చేసి, స్థానిక గ్రూపుల్లో చేరుతూ సమాచారం సేకరించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిలో ఉన్న డిజిటల్ ఆధారాలు, చాటింగ్‌లు, సంభాషణలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి? ఆర్థిక లావాదేవీలు ఏ మార్గాల్లో జరిగాయి? భారత్లో వీరికి ఇంకా ఎవరైనా సహకరించారా? అనే కోణాల్లో స్పెషల్ సేల్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# కొండగట్టు పనులకు బ్రేక్ ఎందుకు?

**న్యూస్ డెస్క్, 28 ఆగస్టు (బిఎన్ఎస్):** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన పార్టీ ప్రశ్నలు సంధించింది. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. కొండగట్టు భక్తుల సౌకర్యాల కోసం మంజూరైన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. కొండగట్టు ఆలయంలో 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పేర్కొంది.

కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులకు జనవరి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ పర్యటించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయితే శంకుస్థాపన పూర్తి అయి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియ ఎందుకు చేపట్టలేదో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది.

కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదించిన నిర్మాణాలను ఆలస్యం చేయడం సరికాదని జనసేన పార్టీ అభిప్రాయపడింది. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ టెండర్ ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హిందూ భక్తుల సౌకర్యాలకు సంబంధించిన అభివృద్ధి పనులను రాజకీయ అంశంగా మార్చకుండా వెంటనే ప్రారంభించాలని జనసేన డిమాండ్ చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది.

ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు స్పందించడం లేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. కొండగట్టు అభివృద్ధి పనులపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్, పొన్నం ప్రభాకర్ మధ్య గతంలో చోటుచేసుకున్న రాజకీయ మాటల యుద్ధం నేపథ్యంలో తాజా విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ సభకు అనుమతి విషయంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. అప్పటి నుంచి జనసేన పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.

# 'దింపుడుకళ్లెం ఆశ'

మొదటి పేజీ తరువాయి

"ఇప్పటికే ఎస్ఏఆర్ వ్యవహారంలో వైసీపీ కోర్టుకు వెళ్లింది. ఎన్నికలు ఆలస్యమైతే తమకు లబ్ధి చేకూరుతుందని జగన్ ఆశపడుతున్నారు, కానీ అది దింపుడుకళ్లెం ఆశ మాత్రమే. ఈ విషయం ఆయనకు ఇప్పటికి కూడా అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు. పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శక పద్ధతిలో జరిగితేనే రాష్ట్ర రాజకీయ స్థిరత్వానికి నాంది పలికినట్లవుతుందని స్పష్టం చేశారు.

బీసీలకు చట్టపరమైన రక్షణ..

బీసీ రిజర్వేషన్లపై స్పందిస్తూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం అనేది ఒక చట్టపరమైన రక్షణ మాత్రమేనని తెలిపారు. చట్టం పరిమితులతో సంబంధం లేకుండా ప్రతి ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీ బీసీలకు ఎక్కువ స్థానాలు ఇస్తూ ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే ప్రాజెక్టును ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# పురపోరు.. పరిషత్ పోరు!

మొదటి పేజీ తరువాయి



ఎన్నికల ఏర్పాట్ల సన్నాహాలకు నెల సమయం ఇచ్చి డిసెంబర్‌లో ఎన్నికలకు వెళ్లాలని పావులు కదుపుతున్నట్టు తెలిసింది. డిసెంబర్‌లో రెండో దఫా పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నందున సిద్ధంగా ఉండాలని, ఇప్పటినుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకోవాలని కాంగ్రెస్ పెద్దలు పార్టీ శ్రేణులకు తాజాగా జరిగిన అంతర్గత సమావేశాల్లో సూచించినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. అయితే, అప్పటికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పాలకవర్గ కాలపరిమితి ముగియనందున ఎన్నికలు నిర్వహించలేదు.

జీహెచ్ఎంసీతోపాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు కూడా ఎన్నికలు జరుగలేదు. కాలపరిమితి ముగియకపోవడంతోపాటు కోర్టు కేసులు ఇతర కారణాలతో మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీల్లో కూడా ఎన్నికలు నిర్వహించలేదు. కొన్ని డివిజన్లలో కూడా ఎన్నికలు జరుగాల్సి ఉన్నది. అయితే, ఉమ్మడిగా ఉన్న జీహెచ్ఎంసీని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్, సైబరాబాద్, మలాజిగిరి అనే మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. వాస్తవానికి కాలపరిమితి ముగిసిన ఆరు నెలల్లోపే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కారణంగా వాయిదా పడుతూ వచ్చాయి. ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియ వల్ల మరికొంత ఆలస్యమైంది. ఇంకా ఆలస్యమైతే మొదటికే మోసం వస్తుందనే భయంతో కాంగ్రెస్‌వర్గాలు ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్టు తెలిసింది.

డిసెంబర్‌లోనే ఎందుకు?

ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న 'సర్' ప్రక్రియ అక్టోబర్ 19 నాటికి పూర్తికానున్నది. ఒకవేళ క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్, పరిష్కారాలకు గడువు పెంచినా అక్టోబర్ 31 నాటికి 'సర్' ముగియనున్నది. రాష్ట్రంలో తుది ఓటరు జాబితా వెలువడనున్నది. కొత్త ఓటరు జాబితా ఆధారంగానే ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ సర్కార్ యోచిస్తున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనాకాలం దాదాపు సగం పూర్తయినా, హామీలు అమలుచేయడం లేదని అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. సాగునీరు, యూరియా, కరెంట్ సక్రమంగా అందడం లేదని రైతులు, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని నిరుద్యోగులు, తులం బంగారం, నెలకు రూ.2,500, స్కూటీలు ఇవ్వడం లేదని మహిళలు, చేయూత పింఛన్ల మొత్తం పెంచడం లేదని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు..

ఇలా అన్ని వర్గాల ప్రజలు సర్కార్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. డిసెంబర్ నాటికి ఎండలు, వర్షాల తీవ్రత తగ్గడంతోపాటు తాగునీరు, విద్యుత్తు సమస్యలు తకువగా ఉంటాయని, ప్రజల ఆగ్రహం తీవ్రత కూడా తగ్గుతుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ఎన్నికలు నిర్వహించకపోతే, కేంద్ర ప్రభుత్వ నిధులు ఆగిపోయే ప్రమాదం కూడా పొంచి ఉన్నది. గ్రామ పంచాయతీల ఎన్నికలు ఏడాది ఆలస్యంగా నిర్వహించడం వల్ల పల్లెలు నిధుల లేమితో సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. పట్టణసంస్థలకు అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే డిసెంబర్ అనువైన సమయమని యోచిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ వర్గాలు, అధికారులు ఎన్నికల నిర్వహణ దిశగా కార్యాచరణ చేపడుతున్నట్టు తెలిసింది.

పురపోరు తర్వాత పరిషత్ ఎన్నికలు

రాష్ట్రంలో రెండో దశ పుర పాలక ఎన్నికలు ముగిసిన వెంటనే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు కూడా వెళ్లాలని రేవంత్ సర్కార్ యోచిస్తున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలకు వెళ్లిన తరహాలోనే బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వకుండానే ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నది. పంచాయతీ ఎన్నికల తరహాలోనే పరిషత్ ఎన్నికలకు సన్నాహాలు చేసుకోవాలని పార్టీ శ్రేణులకు ఇప్పటికే సూచనలు చేసినట్టు తెలిసింది. హైదరాబాద్, మేడ్చల్ మినహాయించి రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లు, 565 మండల పరిషత్‌లకు ఒకేదఫాలో ఎన్నికలు జరుపాలని యోచిస్తున్నది.

ఎన్నికలు జరుగాల్సిన

కార్పొరేషన్లు, యూఎల్‌బీలు, జిల్లా పరిషత్‌లు

కార్పొరేషన్లు: హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, వరంగల్, ఖమ్మం

యూఎల్‌బీలు: మణుగూరు, మందమర్రి, అచ్చంపేట, సిద్దిపేట, నకిరేకల్, కొత్తూరు

జిల్లా పరిషత్‌లు: హైదరాబాద్, మేడ్చల్ మినహా రాష్ట్రంలోని 31 జిల్లా పరిషత్‌లు

మండల పరిషత్‌లు: రాష్ట్రంలోని 565 మండల పరిషత్‌లు

# కూటమి ప్రభుత్వ మంచి ఆశయాలకు గండి..

- రాపూరులో దేవుడి పేరిట 'భూ దందా'!
- లక్షల విలువ చేసే తిక్కన్న వాటిక భూములపై కొందరి కన్ను.. శ్లాబులు, గోడల నిర్మాణం
- తక్షణమే అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాపూరులోని చారిత్రాత్మక తిక్కన్న వాటిక పార్కును అద్భుతంగా అభివృద్ధి చేసి, పర్యాటకంగా తీర్చిదిద్దాలనే అద్భుతమైన ఆకాంక్షతో ముందుకు సాగుతోంది. ప్రాంతీయ వికాసానికి, ప్రజల ఆహ్లాదకర వాతావరణానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంటే... క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు స్వార్థపరులు ప్రభుత్వ ఆశయాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నారు. ఒకవైపు పేదవాడికి సెంట్ స్థలం లభించక ఇబ్బందులు పడుతుంటే, రాపూరు నడిబొడ్డున ఉన్న తిక్కన్న వాటిక పార్కుకు చెందిన లక్షల విలువ చేసే భూమిని కొందరు వ్యక్తులు దర్జాగా ఆక్రమించుకుంటున్నారు.

### దేవుడి ముసుగులో భూ ఆక్రమణలు

దేవుడి పేరు చెబితే ఎవరూ అడ్డుకోరనే నెపంతో కొందరు వ్యక్తులు చుట్టూ ఉన్న భూమిని చాపకింద నీరులా ఆక్రమించుకోవడమే కాకుండా, ఏకంగా షెడ్లు వేస్తూ అక్రమంగా గోడల నిర్మాణం చేపడుతున్నారు. రోజురోజుకూ కబ్జా విస్తరిస్తూ నిర్మాణాలు జరుగుతున్నా తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది గానీ, పంచాయతీ సిబ్బంది గానీ స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక అంతర్యం ఏమిటని, రాపూరు ప్రజలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు.

### అక్రమ గోడలను వెంటనే కూల్చివేయాలి

ప్రభుత్వ ఆశయాలకు మచ్చ తెస్తూ, పర్యాటక రంగానికి కేటాయించిన భూములను కబ్జా చేస్తున్న వారిపై ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తిక్కన్న వాటిక పార్కు పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలి.

### ఇప్పటికే అక్రమంగా నిర్మించిన గోడలను, షెడ్లను తక్షణమే తొలగించాలి

బాధ్యులైన కబ్జాదారులపై మరియు మౌనం వహించిన సిబ్బంది, అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని, తిక్కన్న వాటిక పార్కు భూములను కబ్జాదారుల బారి నుండి పూర్తిగా రక్షించి, పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాపూరు ప్రజలు కోరుతున్నారు.

# పెంచలకోనలో వైభవంగా శ్రావణ పౌర్ణమి వేడుకలు

## వైభవంగా లక్ష తులసి కుంకుమార్చన, పుష్పాభిషేకం



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్): –ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు శ్రావణ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఆధ్యాత్మిక సందడితో, గోవింద నామస్మరణలతో మారుమోగింది.

### లక్ష తులసి కుంకుమార్చన

శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు సామూహిక లక్ష తులసి కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ విశేష పూజలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మరియు సతీమణి సింధు ప్రియాతో కలిసి ఉభయకర్తలుగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక అర్చనలు సమర్పించారు.

### చందనాలంకరణ.. పుష్పాభిషేకం

ముందుగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అర్చకులు, అనంతరం స్వామివారిని దివ్యమైన చందనాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళా భక్తులు తులసి దళాలు, కుంకుమతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో భాగంగా సుమారు 500 కిలోల వివిధ రకాల సుగంధ పుష్పాలతో నిర్వహించిన పుష్పాభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రంగురంగుల పుష్పమధ్యంలో భాసిల్లిన స్వామి, అమ్మవార్ల దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తజనానికి ఆలయ అధికారులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రావణ పౌర్ణమి విశేష పూజలతో పెంచలకోన పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది.

# ఏఈ నూకరాజు కుటుంబ విషాద ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్



రావులపాలెం (బిఎన్ఎస్)ఆగస్టు 28 :కాకినాడ పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడిన మైనర్ రియాన్స్ కార్తికేయ రెడ్డికి సంపూర్ణ రక్షణ కల్పించడంతో పాటు, అతని విద్య, భవిష్యత్తు విషయంలో అన్ని విధాలా అండగా ఉంటామని కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు తెలిపారు.

కోనసీమ జిల్లా రావులపాలెంలోని బాలుడి తాతయ్య కొవ్వూరి భాస్కరరెడ్డి నివాసానికి శుక్రవారం కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, సభ్యులు డా. పి. నాగ మానస, గంగ సూర్యనారాయణ చేరుకుని రియాన్స్ కార్తికేయ రెడ్డిని పరామర్శించారు. బాలుడితో మాట్లాడిన కమిషన్ సభ్యులు కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటన, అంతకుముందు జరిగిన పరిణామాలు, తనకు ఎదురైన ఇబ్బందులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ బాలుడి భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. బాలుడికి సంబంధించిన అంశాలను కమిషన్ అత్యంత సీరియస్‌గా పరిగణిస్తోందని, అతని రక్షణ, విద్య, భవిష్యత్తు కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలుడి నుంచి వెల్లడైన అంశాలను పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కమిషన్ చైర్మన్ తెలిపిన వివరాల ప్రకారం, సాదిక్ ఖాన్ తన తల్లిపై దాడి చేయడాన్ని ప్రశ్నించినందుకు గతంలో తనపై దాడి చేసినట్లు బాలుడు ఆరోపించినట్లు తెలిపారు. అదేవిధంగా తాను గట్టిగా మాట్లాడినా, ప్రశ్నించినా ఉగ్రవాదులకు అప్పగిస్తానంటూ బెదిరించినట్లు బాలుడు చెప్పిన విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. సాదిక్ ఖాన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని బెదిరించినట్లు బాలుడు పేర్కొన్న అంశాన్ని కూడా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

అయితే ఇవన్నీ బాలుడు కమిషన్ సభ్యుల ఎదుట వెల్లడించిన ఆరోపణలేనని, వాటి వాస్తవాలను సంబంధిత అధికారుల దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని తెలిపారు. కుటుంబ విషాదానికి దారితీసిన పరిస్థితులు, బాలుడికి ఎదురైనట్లు చెబుతున్న బెదిరింపులు, వేధింపులపై సంబంధిత అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నూకరాజు కుటుంబ విషాద ఘటనపై శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు. జిల్లా ఎస్పీ, జిల్లా విద్యాశాఖ అధికారి, రెవెన్యూ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖతో పాటు సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

# తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పరామర్శించిన భట్టి విక్రమార్క.



గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ తో మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆత్మీయ భరతంగా చర్చ జరిగింది. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

# రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

**-పోలీసులు స్పందించకపోతే నిరహార దీక్ష చేస్తాం..**

**-హెచ్చరించిన టీకే విశ్వేశ్వర రెడ్డి, బాలేపల్లి మురళీధర్**




రాజమండ్రి(బిఎన్ఎస్)ఆగస్టు 28: రాజమండ్రి జాంపేట వంతెన సమీపంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం చేతిని ధ్వంసం చేసిన ఘటన దారుణమని అర్బన్ కాంగ్రెస్ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికే విశ్వేశ్వర్ రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడారు.

రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, 15 రోజుల్లో నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు సీరియస్ గా స్పందించకపోతే ఆ విగ్రహం వద్దనే నిరాహార దీక్ష చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. రాజమహేంద్రవరంలో శాంతిభద్రతల పరిస్థితి దారి తప్పుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్పీ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం, ప్రియాంక హత్య ఘటనపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడం బాధాకరమన్నారు. గోదావరి పుష్కరాలకు వచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బయట వ్యక్తుల్ని ఎక్కడ పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని ఓటర్లు కూడా ఈ విషయంలో పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. నిన్న కార్పొరేషన్ లో జరిగిన సమావేశంలో ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం తమ దృష్టికి వచ్చిందని నిధులు విడుదల చేయకుండా పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలకు, జాతీయ నాయకుల పట్ల గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశానికి కంప్యూటర్లను పరిచయం చేసి ఐటి రంగంలో ఎంతో అభివృద్ధి, ప్రగతి సాధించేలా కృషి చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసం చేయడం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని చాలా విస్మయానికి గురి చేసిందని అన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు ఎప్పటి నుంచి సరైన విధంగా నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోకపోతే యాత్రికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందన్నారు.

# శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో వైభవంగా రక్షాబంధన్ వేడుకలు




హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగిర్, శారదాధామం ప్రాంగణంలో నెలకొని ఉన్న శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు అత్యంత ఆత్మీయభరి వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, రక్షణకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ మహోత్సవం ప్రాంగణంలో పండుగ శోభను నింపింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సరస్వతి విద్యా పీఠం తెలంగాణ రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను మరియు భారతీయ సంస్కృతిలో దానికి ఉన్న విశిష్ట స్థానాన్ని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. రక్షాబంధన్ కేవలం ఒక దారపు పోగు కాదని, అది సమాజంలో సోదరభావాన్ని, పరస్పర రక్షణ భావనను పెంపొందించే పవిత్రమైన బంధమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ గారి పర్యవేక్షణ మరియు మార్గదర్శకత్వంలో ఈ వేడుకల సమన్వయం అత్యంత క్రమశిక్షణతో, శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని, పండుగ సందేశాన్ని చాటిచెప్పారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన ఈ రక్షాబంధన్ వేడుకలు అందరిలో నూతన ఉత్సాహాన్ని, ప్రేమానురాగాలను నింపుతూ విజయవంతంగా ముగిశాయి.

# శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



శ్రీ శారదా ధామంలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల నడుమ నిర్వహించబడ్డాయి. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, మరియు సోదరభావాన్ని పెంపొందించేలా ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది.

ఈ వేడుకలు పాఠశాల ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ మరియు ఇంగ్లీష్ విభాగాధిపతి గోకులం ఆచార్యుల పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో ఎంతో క్రమశిక్షణతో జరిగాయి. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిని సరైన మార్గంలో నడిపించడంలో ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ విశేష సేవలు అందించారు. ఆమె నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం సోదర–సోదరీమణుల పవిత్ర బంధ విశిష్టతను ప్రతిబింబించింది.

కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన "కుటుంబం -- సంప్రదాయ విలువలు" నాటిక అందరినీ ఆకట్టుకుంది. కుటుంబ బంధాల మాధుర్యాన్ని, పరస్పర ఆత్మీయతను మరియు భారతీయ సంస్కృతీ పరంపరను విద్యార్థులు తమ అద్భుత అభినయంతో హృద్యంగా ఆవిష్కరించారు. రాఖీ పండుగ విశిష్టతను వివరిస్తూ చిన్నారులు ఇచ్చిన సందేశం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. అనంతరం అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలను చాటిచెప్పేలా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వర్ణరంజిత దుస్తులలో చిన్నారులు చేసిన సంప్రదాయ నృత్యాలు, సందేశాత్మక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ ప్రదర్శనలు కన్నులపండువగా సాగి ప్రతి ఒక్కరినీ మైమరిపించాయి. సృజనోత్సవం--2026 సంగీత విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం జరిగింది. ప్రిన్సిపల్ రమా విశ్వనాథన్ విజేతలకు ప్రేమపూర్వకంగా బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల సంగీత ప్రతిభ మరింత వికసించాలని ఆకాంక్షిస్తూ, ఆమె అందించిన ప్రోత్సాహం చిన్నారులలో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ విధంగా శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన రాఖీ పౌర్ణమి సంబరాలు మరియు బహుమతుల ప్రదానోత్సవం విద్యార్థులు, ఉపాధ్యాయుల నడుమ ఆనందభరితమైన వాతావరణంలో అత్యంత విజయవంతంగా ముగిశాయి.



# చెరువులు కనుమరుగవడంతోనే నగరాల్లో వరదలు: హైడ్రా కమిషనర్



హైదరాబాద్,బిఎన్ఎస్: నగరాల్లో వరదలు ముంచెత్తడానికి చెరువులు కనుమరుగవడమే ప్రధాన కారణమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. హైదరాబాద్‌లో 3, 4 సెంటీమీటర్ల వర్షం వచ్చినా రహదారులపైకి నీరు చేరుతోందని చెప్పారు. ఇక్కడ చెరువులు ఆక్రమణలకు గురవడంతోపాటు ఇన్ లెట్లు సరిగ్గా లేవన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 'అర్బన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

" దేశంలోని అనేక నగరాల్లో చెరువులు కబ్జాలకు గురవుతూ కనుమరుగవుతున్నాయి. దిల్లీలోని అనేక చెరువులు పార్కింగ్ యార్డులుగా మారాయి. హైడ్రా ద్వారా వస్తున్న మార్పులను గ్రహించి పశ్చిమ బెంగాల్ ఐఏఎస్ అధికారులు సంప్రదించారు. కోల్‌కతా నగరంలోనూ ఈ తరహా ఏజెన్సీ అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తెలంగాణలో హైడ్రాను అడ్డుకునేందుకు ల్యాండ్ మాఫియాకు చెందిన వారు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వాటన్నింటినీ దాటుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. సామాజిక మాధ్యమాల్లో హైడ్రాపై అబద్ధాలు ప్రసారం చేస్తున్నారు. అనుమతి కలిగిన ఏ భవనాన్ని కూల్చే ప్రయత్నం జరగలేదు. కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను చట్ట ప్రకారమే రక్షిస్తున్నాం. రెండేళ్లలో 3,350 ఎకరాల కబ్జాలకు గురైన భూమిని రక్షించాం. దాని విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుంది" అని రంగనాథ్ అన్నారు.



# సినిమా న్యూస్



## ‘ఎపిక్’ రెడీ




ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన చిత్రం ‘ఎపిక్’. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ బృందం చిత్రీకరణ మొత్తం పూర్తయినట్లు అధికారికంగా ప్రకటించింది. షూటింగ్ పూర్తవడంతో ఈ మూవీకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం సెప్టెంబర్ 11న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే మరికొన్ని రోజుల్లోనే విడుదల తేదీకి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా రాబోతున్నట్లు సమాచారం. ‘బేబీ’ వంటి భారీ విజయం తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న సినిమా కావడంతో ‘ఎపిక్’పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. మరి ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఏ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.



## శర్వా ఊరమాస్ లుక్!


టాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శర్వానంద్ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’పై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి రక్షాబంధన్ పోస్టర్ ఆసక్తిని మరింత పెంచుతోంది. గ్రామీణ నేపథ్యంలో కనిపిస్తున్న శర్వానంద్ లుక్ మాత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. ‘భోగి’లో శర్వానంద్ గంగా అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు వచ్చిన పాత్రలకు భిన్నంగా శర్వా కనిపించబోతున్నారనే వార్తలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. రక్షాబంధన్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో శర్వానంద్ తన సోదరీమణులతో కలిసి కనిపించారు. చుట్టూ తాటి చెట్లు, మట్టి ఇల్లు, పల్లెటూరి వాతావరణం.. ఇలా మొత్తం పోస్టర్ చూస్తే పాత కాలంలోకి తీసుకెళ్లేలా ఉంది. గ్రామీణ లైఫ్ స్టైల్ ను ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ను రూపొందించారు. ఈ సినిమా కథ కూడా 1960 నాటి కాలంలో సాగుతుందని సమాచారం.

ఇటీవలే ‘భోగి’ భారీ క్లైమాక్స్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. దీంతో సినిమా షూటింగ్‌కు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తయినట్లే. తొలుత ఈ సినిమాని రాఖీ పండుగ సందర్భంగా ఈరోజు రిలీజ్ చేయాలని అనుకున్నారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం వల్ల రిలీజ్ కు కొంత ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీజీ వర్క్ పూర్తవ్వడానికి సమయం పడుతుండటంతో రిలీజ్ డేట్ విషయంలో చిత్రబృందం తొందరపడటం లేదని సమాచారం. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ ‘భోగి’ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వం వహిస్తుండటంతో యాక్షన్, ఎమోషన్, పీరియడ్ ఎలిమెంట్స్‌కు ప్రాధాన్యత ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మిగిలిన పోస్ట్ ప్రొడక్షన్ పనులపై చిత్రబృందం దృష్టి పెట్టింది. సినిమా పూర్తి స్థాయి పనులు ఎప్పుడు ముగుస్తాయనే దానిని బట్టి థియేట్రికల్ రిలీజ్ తేదీని ఆఫీషియల్ గా ప్రకటించనున్నారు మేకర్స్.

## త్రిపాత్రలో బన్నీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘రాకా’. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఒక ఆసక్తికరమైన ఇన్సైడ్ సమాచారం ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమైంది. ఫిలిం నగర్ ఇన్సైడ్ వర్గాల టాక్ ప్రకారం ఈ సినిమాలో అల్లు అర్జున్ ఏకంగా త్రిపాత్రాభినయంలో అలరించబోతున్నట్లు తెగ ప్రచారం సాగుతోంది. కథలో భాగంగా ఆయన తండ్రి పాత్రతో పాటు ఇద్దరు కొడుకుల పాత్రల్లోనూ కనిపించనున్నారని తెలుస్తోంది. తండ్రి పాత్రను ఎంతో పవర్‌ఫుల్‌గా ఇంటెన్స్ షేడ్స్‌తో తీర్చిదిద్దగా, ఇద్దరు కొడుకుల క్యారెక్టర్లను పూర్తి భిన్నమైన వైవిధ్యభరితమైన మేనరిజమ్స్‌తో డిజైన్ చేసినట్లు వినికిడి.

డైరెక్టర్ అట్లీకి తన సినిమాల్లో కథానాయకులను ద్విపాత్రాభినయం లేదా త్రిపాత్రాభినయంలో చూపించడం అలవాటే. ‘అదిరింది’లో విజయ్, జవాన్ లో షారుక్ డ్యూల్ రోల్స్ లో కనిపించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో చేయబోతున్న ఈ విజువల్ వండర్‌లో మూడు విభిన్న గెటప్‌లు, విభిన్న క్యారెక్టరైజేషన్లతో బన్నీ వేరియేషన్స్ చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు తన కెరీర్‌లో డ్యూయల్ రోల్ లేదా త్రిపాత్రాభినయం చేయని అల్లు అర్జున్‌కు ఇది ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వార్త నిజమైతే, బాక్సాఫీస్ వద్ద అభిమానులకు పూనకాలు రావడం ఖాయం. ఫస్ట్ లుక్ తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ సినిమాకు కోలీవుడ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు.




## అగ్ర దర్శకుల కలయికలో



భారతీయ చిత్రసీమలో సరికొత్త రికార్డులను సృష్టించి, తమదైన మార్క్ విజన్‌తో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న ఇద్దరు దిగ్గజ దర్శకులు ఇప్పుడు చేతులు కలపబోతున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఎస్. శంకర్ మరియు మాస్ కమర్షియల్ డైరెక్టర్ ఎ. ఆర్. మురుగదాస్ కాంబినేషన్‌లో ఒక అత్యంత భారీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుందనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ఈ బిగ్గెస్ట్ కొలాబరేషన్‌లో రాబోయే ఈ భారీ చిత్రానికి ఎ. ఆర్. మురుగదాస్ పవర్‌ఫుల్ కథను అందించనుండగా, దర్శకుడు శంకర్ దర్శకత్వంలో బిగ్ స్క్రీన్‌పై ఆవిష్కరించనున్నారు. ఇద్దరూ సామాజిక అంశాలను, స్ట్రాంగ్ మెసేజ్‌ను భారీ విజువల్స్‌తో కమర్షియల్‌గా చూపించడంలో దిట్ట. ఒకరు అందించే బలమైన స్క్రిప్ట్, కథనానికి మరొకరి అత్యున్నత మేకింగ్ మరియు విజువల్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డుల తుఫాను ఖాయమని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత కొంతకాలంగా సరైన విజయం కోసం చూస్తున్న ఈ ఇద్దరు మాస్టర్ మైండ్స్.. స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు ఇండియన్ బిగ్గెస్ట్ డైరెక్టర్లు ఒకే ప్రాజెక్ట్ కోసం చేయి కలపడం అనేది అత్యంత అరుదైన విషయమైనందున, ఈ కాంబోపై ఆడియెన్స్ లో కాస్త మంచి అంచనాలే ఉన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇందులో నటించబోయే కాస్టింగ్ మరియు ప్రొడక్షన్ వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. మరి ఈ సినిమాతో శంకర్ సాలిడ్ కంబ్యాక్ ఇస్తాడా అనేది చూడాలి.

## ‘ఐ యామ్ గేమ్’లో దుల్కర్ పాట!

దుల్కర్ సల్మాన్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఆయన హీరోగా నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఐ యామ్ గేమ్’ నుంచి రెండో సింగిల్ ‘లూజర్ సాంగ్’ విడుదలైంది. ఇప్పటికే సినిమాపై బజ్ పెరుగుతున్న వేళ, ఈ పాటతో దుల్కర్ స్వయంగా గాయకుడిగా మారడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉల్లాసమైన బీట్, ఎనర్జిటిక్ ట్యూన్‌తో సాగుతున్న ఈ పాట దుల్కర్ పాత్రలోని అటిట్యూడ్‌ను ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది. ‘లూజర్ సాంగ్’కు జేక్స్ బెజోయ్ సంగీతం అందించారు. మలయాళ వెర్షన్‌ను దుల్కర్ సల్మాన్ స్వయంగా ఆలపించగా, సుహైల్ కోయా సాహిత్యం అందించారు. ఈ సాంగ్ ఎనర్జిటిక్ గా ఉండటంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. భాష మారినా పాటలోని ఫీల్ మాత్రం అలాగే ఉంటుందని దుల్కర్ సల్మాన్ సోషల్ మీడియా ద్వారా ఓ మెసేజ్ కూడా ఇచ్చారు.

‘ఐ యామ్ గేమ్’ లో దుల్కర్ సల్మాన్ ‘డాన్ జాన్’ అనే అత్యంత స్టైలిష్, డిఫరెంట్ షేడ్స్ ఉన్న ఒక గ్యాంబ్లర్ పాత్రలో నటిస్తున్నారు. ఈ క్రమంలో రాజకీయ నాయకులు, బుక్‌మేకర్లు, అండర్‌వరల్డ్ బెట్టింగ్ మాఫియాతో తలపడుతూ, ప్రాణాలను పణంగా పెట్టి సాగించే ఒక ప్రమాదకరమైన సర్వైవల్ గేమ్‌లో ఆయన పాత్ర ప్రయాణం సాగుతుంది. చాలా కాలం తర్వాత ఇంత అల్లరి, చలాకీ ఉన్న పాత్రలో నటిస్తున్నానని దుల్కర్ గతంలో చెప్పడంతో డాన్ జాన్ పాత్రపై అంచనాలు మరింత పెరిగాయి. యాక్షన్‌తో పాటు కామెడీ, క్రైమ్, థ్రిల్ అంశాలను మేళవించిన ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

‘ఐ యామ్ గేమ్’లో దుల్కర్ సల్మాన్‌తో పాటు ఆంటోనీ వర్గీస్ పెపే, కయాదు లోహర్, కతిర్, మిస్కిన్, సంయుక్త, వినయ్ ఫోర్ట్, జయసుధ, శ్యామప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బెజోయ్ సంగీతం అందిస్తున్నారు. మొదట ఈ సినిమాను 2026 ఆగస్టు 21న ఓనం సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. అయితే కొన్ని కారణాల వల్ల 2026సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ‘లూజర్ సాంగ్’ కూడా ఆ అంచనాలకు మరింత ఊపునిచ్చింది.

ఇక ‘ఐ యామ్ గేమ్’ తర్వాత దుల్కర్ సల్మాన్ చేతిలో మరికొన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఆకాశంలో ఒక తార’లో సాత్విక వీరవల్లి, శృతి హాసన్ కథానాయికలుగా నటిస్తున్నారు. మరోవైపు ‘శ్రీ శ్రీ’ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, రవి నెలకుడిటి దర్శకత్వం




వహిస్తున్నారు. దీక్షిత్ శెట్టి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. మొత్తంగా చూస్తే.. ‘లూజర్ సాంగ్’తో ‘ఐ యామ్ గేమ్’ ప్రమోషన్స్‌లో మరో ఆసక్తికరమైన అడుగు పడింది. దుల్కర్ సల్మాన్ నటనతో పాటు ఆయన గాత్రం కూడా ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. మరి డాన్ జాన్‌గా దుల్కర్ థియేటర్లలో ఎలాంటి గేమ్ ఆడబోతున్నాడో తెలియాలంటే సెప్టెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే.